అభివృద్ధి పనుల పరిశీలన



కీసర: నాగారం మున్సిపాలిటీ శ్రీరామ్‌నగర్ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను సోమవారం నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కాలనీ అధ్యక్షులు రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, సతీష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ మండపం వద్ద సోమవారం గణపతి హోమం నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

కలుషిత జలాలతో చేపలు మృతి

ఆందోళనలో మత్స్యకారులు



మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్ ముదిరాజ్

ఘట్‌కేసర్: ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కాలుష్య జలాలు, వ్యర్థాలు కలవడంతో లక్షలాది రూపాయలు విలువైన వేల చేపలు సోమవారం మృత్యువాత పడ్డాయి. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి సుకీర్తి మృతి చెందిన చేపలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలుషిత జలాలు శుద్ధి చేయడానికి ఈటీపీ ప్లాంటును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



కిష్టాపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్ కాంగ్రెస్ నేతలు సోమవారం ప్రారంభించారు. 4వ వార్డు (కిష్టాపూర్), పూడూర్ 10వ వార్డులో నాయకులు నిర్మాణ పనులను ప్రారంభించారు. పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నియామకం



ఘట్‌కేసర్: అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఘట్‌కేసర్‌కు చెందిన బర్ల దేవేందర్‌ముదిరాజ్ ఎంపికయ్యారు. సోమవారం నగరంలో నిర్వహించిన అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ సమాజ్ జాతీయ సమావేశంలో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రోటం భూపతి కోలీ, రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ముదిరాజ్‌లను బీసీ డి గ్రూపు నుంచి ఏ గ్రూపులోకి మార్చేంత వరకు విశ్రమించేది లేదన్నారు. అఖిల భారతీయ కోలీ సమాజ్ రాష్ట్ర కోశాధికారి అశోక్ రామదాసు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



హరీశ్

ఘట్‌కేసర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన గాజపాక హరీశ్ (32) ఆగస్టు 30న బయటకు వెళ్తొస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురు చూపులకు తెరపడేనా..!

గ్రేటర్ సహా శివారుల్లో జీఓ 58,59,118 కింద వచ్చిన దరఖాస్తులు 1.19 లక్షలు

- ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే భూ క్రమబద్ధీకరణకు మోక్షం
- ఆదేశాల కోసం ఎదురు చూస్తున్న రెవెన్యూశాఖ అధికారులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్‌తో సహా శివారులో ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం గడుపుతున్న నిరుపేదలు 20 నెలలుగా భూ క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. రెండోవిడత భూ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం ఆక్రమిత నివాస స్థలాల్లో నివాసం ఉంటున్న పేద ప్రజల నుంచి జీఓ 58,59 కింద అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిశీలన కార్యక్రమాన్ని కూడా అప్పట్లోనే పూర్తి చేసింది. అర్హులను గుర్తించి జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. జనరల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో వాయిదా పడింది. జీఓ 118 కింద స్వీకరించిన దరఖాస్తుల పురోగతి కూడా నిలిచిపోయింది.

ప్రభుత్వం ఏర్పడి దాదాపు 19 నెలలు..

- కొత్త ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు కావస్తున్నా.. దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. పేద ప్రజలకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆరు గ్యారంటీలు, భూభారతి వంటి అంశాలతో పాటు రెవెన్యూ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం జీఓ 58,59 దరఖాస్తుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రెవెన్యూ శాఖ అధికారులు కూడా జీవో 58,59 పై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. త్వరలో జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోగలదన్న ఆశాభావాన్ని గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని దరఖాస్తుదారులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- నగర శివారులోని 44 కాలనీల్లో నివాస స్థలాల్లో భూ క్రమబద్ధీకరణకు సంబంధించిన అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 118 పై కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని స్థానికులు ఆశిస్తున్నారు. వీటికి సంబంధించిన గ్రేటర్‌తో సహా శివారుల్లో సుమారు 1.19 లక్షలకు పైగా దరఖాస్తులు ఉంటాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

మేడ్చల్ జిల్లాలోనే అత్యధికం..

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 26,092 దరఖాస్తులు రాగా.. 15 మండలాల పరిధిలోని పురపాలికలు, గ్రామపంచాయతీల్లో 41 బృందాలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. జిల్లాలో జీఓ 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను కూడా క్షేత్ర స్థాయిలో 41 బృందాలు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.
- రాష్ట్రంలోనే మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58,59 కింద అత్యధికంగా 41,292 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిశీలన బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.
- ప్రతీ క్షేత్ర స్థాయి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయటంతో పాటు జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా..? లేదా అని చూసుకోవడం, సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన ' మొబైల్ యాప్'లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిఫార్సు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరోసారి పరిశీలించిన తర్వాత ఆమోదం.. లేదా తిరస్కరించే అవకాశం ఉంటుంది.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట మేడ్చల్ జిల్లా టీజేఏసీ ఆందోళన



సాక్షి,మేడ్చల్ జిల్లా: సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఏపీఎస్) అమలు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీజేఏసీ చైర్మన్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ''పెన్షన్ విద్రోహ దినం'' పేరుతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్), కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) మాత్రమే అమలు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీజేఏసీ అధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేశారు. టీజేఏసీ జిల్లా చైర్మన్, సెక్రటరీ రవిప్రకాష్, వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ఉద్యోగుల కష్టార్జితమైన భవిష్యత్తు భద్రతను బలిపెట్టే వంటి విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించేదిలేదని హెచ్చరించారు. 2004కి ముందు ఉద్యోగులకు వర్తించిన పాత పెన్షన్ విధానమే ఉద్యోగుల నిజమైన హక్కు అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. టీజేఏసీ నాయకులు రామ్మోహన్, కురుమూర్తి, సుధాకర్, రవీందర్, వేంకటేశ్వర్లు,ప్రేమ్‌కుమార్, జయసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, భరత్‌కుమార్, శేషసాయి, గిరికాంత్, అశ్విని, సుధీర్, కలెక్టరేట్ యూనిట్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్లపై కేబుల్ వైర్లు



పోచారం: ఇంటర్నెట్, కేబుల్ టీవీ వైర్లను తొలగించి రోడ్లపైనే పారవేయడంతో అవే ప్రజలకు యమపాశాలుగా మారుతున్నాయి. ఇష్టానుసారంగా వైర్లను రోడ్లపై పారవేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. రహదారులపై వెళ్తున్న పాదచారుల కాళ్లకు కేబుల్ వైర్లు తగిలి పడిపోతున్న సందర్భాలున్నాయి. ఇవే వైర్లతో వాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న పనికిరాని వైర్లను తొలగించడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠకులకు సౌకర్యవంతంగా గ్రంథాలయాలు

జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

శామీర్‌పేట్: పాఠకులకు సౌకర్యవంతంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండల ఉమ్మడి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 18 శాఖా గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఉన్న జనాభాకు అనుగుణంగా మరో 14 కొత్త గ్రంథాలయాల కోసం తీర్మానం చేసి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించామన్నారు. తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్, అలియబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని పూర్తయిన శాఖ గ్రంథాలయాలతో పాటు మధ్యలోనే ఆగిపోయిన కీసర గ్రంథాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

పోచారం: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందాయి. నారపల్లిలోని దివ్యానగర్‌లో జరుగుతున్న రెండు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం స్థానికుడు ఫిర్యాదు చేశాడు. కొర్రెముల్‌లోని ఏకశిలానగర్ వెంచర్‌లో ఓ మహిళ చేపట్టిన నిర్మాణాన్ని నిలిపేయాలని మరో వ్యక్తి ఫిర్యాదు చేశారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



ఘట్‌కేసర్: కేఎల్‌బీ కప్ తెలంగాణ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌ను ఏదులాబాద్ స్థానిక డీఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఛాంపియన్‌షిప్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాగా మర్పల్లిగూడ నుంచి 7 మంది క్రీడాకారులు పాల్గొనగా.. 4 పసిడి, 3 రజతం సాధించారు. ఈ సందర్భంగా తైక్వాండో శిక్షకుడు నాగరాజు విజేతలను అభినందించారు.

ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడా పోటీలు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్‌గూడలో సోమవారం 89వ ఎస్ఎఫ్ జోనల్‌స్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభమయ్యాయి. మూడుచింతలపల్లి, శామీర్‌పేట్‌లో విద్యాధికారులు భాగ్యమణి, కమలాకర్, జోనల్ సెక్రటరీ గుర్రం సత్తిరెడ్డిలు ఈ క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారు జోనల్ స్థాయికి ఎంపిక అవుతారన్నారు. ఈ క్రీడల్లో 180 జట్లు, 2200 మంది క్రీడాకారులు పాల్గొంటారని వారు వివరించారు. హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్‌చారి, జ్యోతి, మదన్‌మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పంచతత్వ పార్కులో పునరుద్ధరణ పనులు



పోచారం: ఎల్ఐజీ కాలనీలో ఏర్పాటు చేసిన పంచతత్వ పార్కులో ఔషధ మొక్కలు కాకుండా ఇతర పెరుగుతున్నాయని, వీటిని తొలగించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. సోమవారం పోచారం మున్సిపల్ సిబ్బంది పనులను సిబ్బంది ప్రారంభించారు. పార్కులో పెరుగుతున్న గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి కాలనీవాసుల కోసం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కమిషనర్ నిత్యానంద్ కృషి చేస్తున్నట్లు సమాచారం.

బీసీలకు పెద్దపీట వేసే ఏకైక పార్టీ కాంగ్రెస్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: దేశం, రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు అమోదించిన సందర్భంగా మేడ్చల్ లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత భారత్ జోడో యాత్రలో కులగణన చేసి బీసీలకు ప్రాధాన్యతను ఇస్తామని చెప్పి తెలంగాణలో అమలు చేసి చూపించారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి అసెంబ్లీలో అమోదింపజేశారన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుతో ఏళ్లుగా బీసీలు కలగంటున్న రాజ్యాధికారం సాకారం అవుతుందని బీసీ వర్గాల నాయకులు స్థానిక సంస్థల్లో పాలకులుగా వెలుగొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, శశికళాయాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వెస్ట్ గాంధీనగర్‌లో మాజీ చైర్మన్ చంద్రారెడ్డి



నాగారంలో బీజేపీ నేత రాహుల్‌రెడ్డి

భక్తి శ్రద్ధలతో గణపయ్యకు పూజలు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాగారంలో పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల ప్రతిజ్ఞ

'మన పాఠశాల మన ఆత్మగౌరవం' నినాదం



మేడ్చల్: మన పాఠశాల మన ఆత్మగౌరవం దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల ప్రతిజ్ఞ కార్యక్రమాలను మేడ్చల్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. పాఠశాలను పవిత్ర స్థలంగా భావించి దాని అభివృద్ధి కోసం మనవంతు బాధ్యతలు తీసుకుంటామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

88 సమస్యలపై అధికారులకు దరఖాస్తులు



సాక్షి,మేడ్చల్‌జిల్లా: కలెక్టరేట్ ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కారమవుతాయని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వివిధ పురపాలక సంఘాల్లోని కాలనీలు, బస్తీలు, మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వస్తున్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలతో బాధపడుతున్న మహిళలు, ప్రజలు 88 ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కలెక్టర్ పరిష్కరించగలరన్న నమ్మకంతో సమస్యలపై దరఖాస్తులను రాత పూర్వకంగా అందజేశారు.

- సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన, అక్రమ నిర్మాణాలు, భూ భారతి, విద్య, వైద్యం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.
- పలు సంఘాలు, కాలనీ, బస్తీ కమిటీలు, అసోసియేషన్ల ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు సమర్పించారు.

రెవెన్యూ సమస్యలపైనే అధికం..

- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని కలెక్టరేట్ ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలపైనే అధికంగా 36 ఫిర్యాదులు రాగా.. ఇందులో కలెక్టరేట్ 'డీ' సెక్షన్‌కు సంబంధించిన దరఖాస్తులు 14, 'ఇ' సెక్షన్ ఫిర్యాదులు 5 వరకు ఉన్నాయి.
- కీసర ఆర్డీఓకు సంబంధించి 6 , మేడ్చల్, కూకట్‌పల్లి, అల్వాల్, ఎంసీపల్లి తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి ప్రజావాణిలో 6 ఫిర్యాదులు వచ్చాయి.
- పురపాలక సంఘాలు జవహర్‌నగర్, అలియాబాద్, పోచారం, తూంకుంట, మేడ్చల్, దమ్మాయిగూడ, ఎంసీపల్లిల నుంచి అనుమతి లేని అక్రమ నిర్మాణాలకు సంబంధించి చర్యలపై ఫిర్యాదులు వచ్చాయి.
- కుత్బుల్లాపూర్, అల్వాల్, మాసాపేట మున్సిపల్ సర్కిళ్ల పరిధిలో నుంచి 5 ఫిర్యాదులు అందాయి. సంక్షేమ శాఖలకు సంబంధించి 6, జిల్లా గృహ నిర్మాణశాఖకు 4, ఫిర్యాదులకు జిల్లా కలెక్టర్‌కు వచ్చాయి.
- విద్యాశాఖకు సంబంధించి 3 ఫిర్యాదులు రాగా.. పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు , రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అసైన్డ్ భూముల పరిరక్షణపై కూడా వినతులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

బకాయి బిల్లులపై కలెక్టర్‌కు వినతి

పాత గ్రామ పంచాయతీ కీసరతో సహా పలు జీపీలు దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలలో విలీనం కాగా.. దీనికి ముందు పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులు(ఎంబీ బుక్) పూర్తిగా రికార్డు కాకపోవడంతో బిల్లులకు సంబంధించిన బకాయిలు రూ.కోటి వరకు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పలువురు కాంట్రాక్టర్లు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

డీపీఓకు ఆదేశాలు..

ఎంబీ రికార్డ్ బుక్స్ కూడా తమ వద్ద ఉన్నాయని కాంట్రాక్టర్లు చెప్పడంతో స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ''ఈ రికార్డులు మీ వద్దకు ఎలా వచ్చాయని''..? ప్రశ్నించడంతో పాటు సంబంధిత అప్పటి గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ డీపీవో సాంబశివరావును ఆదేశించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలన్నారు. కాంట్రాక్టర్లు నర్సింహచారి, సుబాష్, శ్రవణ్‌రెడ్డి, కృష్ణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించండి

ప్రజలు అందజేసే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం, నమ్మకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో వారికి తెలుపాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

-జిల్లా కలెక్టర్ మనుచౌదరి